
# సరిహద్దు గీతలు



డా॥ ఎ.యం. అయోధ్యారెడ్డి

**ఆవి డెవరో** నాకు తెలియదు.

మా ఇద్దరికీ కనీసం ముఖపరిచయమన్నా లేదు.

ఆ సాయంత్రం స్కూల్ నుంచి తిరిగొస్తూ రోడ్డుమీద పరధ్యాన్నంగా నడుస్తుంటే ఎవరో చప్పట్లు కొట్టి పిలిచారు. తిరిగిచూస్తే ఆవిడ.

ఆవిడవైపు విచిత్రంగా చూస్తూ మొహమాటంగా నిల్చుండిపోయా.

"మీరు ప్రఖ్యాత రచయిత్రి ఆలోచనాదేవి గారి చెల్లెలు కదూ?" అందామె నా దగ్గరగా వచ్చి నా చేయి పట్టుకుంటూ.

అవునని మౌనంగానే తెలిపాను.

"మీ పేరేమిటి?"

"అరుంధతి." చెప్పాను.

"చాలా మంచిపేరు." నవ్విం దామె. "రండి అలా కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం" అంటూ మరోమాట కవకాశం లేకుండా క్యాంటీన్లోకి దారి తీసింది.

ఆమె చొరవకి ఆశ్చర్యంగానూ, బిడియంగానూ ఉంది నాకు. చిన్నగా తలెత్తి చూశాను. పాతికేళ్ళుంటా యామెకి. ఎర్రగా, బొద్దుగా బావుంది మనిషి. మధ్య పాపిట తీసి అల్లుకున్న పొట్టిజడ, నుదుట వెడల్పాటి బొట్టు. ఆకుపచ్చటి చీరా, లేత గులాబి రంగు జాకెట్ ధరించిం దామె.

భుజానున్న బాగ్ తీసి పక్కన పెడుతూ అడిగిం దామె "చెప్పండి. ఏం తీసుకుంటారు?"

"అబ్బె ... ఏం వద్దండి! ఇంటికెళ్ళి టిఫిన్ తీసుకుంటా వెళ్ళాగా" అన్నాను మొహమాటం ఫీలవుతూ.

"పోనీ కాఫీ అయినా తాగండి" అంటూ కాఫీ ఆర్డర్ చేసింది.

సర్వర్ వెళ్ళిపోయాక నా కేసి సూటిగా చూస్తూ అంది: "ఇప్పుడు చెప్పండి, అరుంధతిగారూ! రాంబాబుతో మీ కెప్పట్నుంచి పరిచయం?"

ఆశ్చర్య పోయా నామె ప్రశ్నకి. రాంబాబు ఈవిడ కెట్లా తెలుసా అనుకున్నా. తేరుకుని జవాబు చెప్పాను—

"దాదాపు రెండు మాసాల్నుంచి."

"ఎలా పరిచయమో చెబుతారా?"

ఈ ఆరాలన్నీ ఈవిడ కెందుకో? అసలింతకూ ఎవ రీవిడ? ముక్కూ మొహం తెలియని ఈమె ప్రశ్నలకు జవాబు లెందుకు చెప్పాలి నేను?

నేను తటపటాయిస్తున్నట్లుగా గ్రహించిందామె. అందుకని ఇష్టం లేకపోయినా చెప్పాను. "రెండునెలల క్రితం ఏ మీటింగులో మా అక్కయ్య పరిచయం చేసింది. కథా రచయితగా, చిత్రకారుడిగా నా కాయన అంతకుముందే తెలుసు."

ఈ లోగా సర్వర్ కాఫీలు తెచ్చాడు. కాఫీలు త్రాగుతున్నంతసేపూ ఆవిడ ఇంకేమీ అడగలేదు. నేను తాగిన కప్పు కిందుంచి, "ఇక వెళతానండి" అంటూ లేవబోయాను.

"ఉండండి! దయచేసి కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలి" అందామె ఆదుర్దాగా చూస్తూ.

వెళ్ళే ప్రయత్నం మానుకుని కూర్చోక తప్పలేదు నాకు.

"చూడండి, అరుంధతిగారూ!" గొంతు సవరించు కొంటూ అందామె. "మిమ్మల్ని చూస్తుంటే చాలా అమాయకంగా కనిపిస్తున్నారు. మీ కన్నా వయసులో నేను పెద్దదాన్ని. పైగా రచయిత్రిగా మీ అక్కయ్యంటే నాకు అపారమైన గౌరవాభిమానాలు. ఆ కారణంగానే ప్రమాదంలో చిక్కుకోబోతున్న మిమ్మల్ని రక్షించాలనుకొంటున్నాను."

ఈ మాటకు నాలో కుతూహలం పెరిగింది. "ఏమిటి మీ రనేది? వివరంగా చెప్పండి" అన్నాను టేబుల్ మీద రెండు మోచేతులా ఆనించి ఆమె మొహంలోకి సూటిగా చూస్తూ.

హఠాత్తుగా ఆమె మొహం గంభీరంగా అయ్యింది. "అవును! మీరు గుడ్డిగా స్నేహం చేస్తున్న ఆ రాంబాబు నో పెద్ద పోకిరీడు. స్నేహంగా ఉంటూనే మిమ్మల్ని మెల్లగా తన వలలోకి లాక్కుంటాడు. ఆసంగతి మీకు తెలీదు. అందుకే ముందే హెచ్చరిస్తున్నాను."

నేనో క్షణం అయోమయంలో పడిపోయాను. అంతలోకే నాలోని వివేకం మేల్కొంది. చురుగ్గా ఆమెకేసి చూసి వెళతా నంటూ లేచాను. నాతోపాటు ఆవిడకూడా లేచింది. నా భుజం తట్టుతూ, "మీరు చెడిపోతుంటే నేను చూస్తూ వూరుకోలేను. అమాయక యువతుల్ని బుట్టలో వేసుకుని వారిని చెడగొట్టడంలో రాంబాబు ఆరితేరిన వాడు. నేనెంతో అభిమానించి గౌరవించే రచయిత్రి అలోచనాదేవి సోదరిగా మిమ్మల్ని కాపాడడం నా విధి. ప్లీజ్! ఇంకెప్పుడూ ఆ రాంబాబుతో తిరక్కండి. లేదా మీ అక్కయ్యతో చెప్పాల్సి వస్తుంది" అని చెప్పి రోడ్డు మీద వెళ్తున్న రిక్షా నాపి ఎక్కేసిందామె.

నేను ఉన్నచోటనే అచేతనంగా ఓ నిముషం నిలబడి, తర్వాత మెల్లగా ఇల్లు చేరాను.

నా మనసంతా పాడయ్యింది. గదిలోకి నడిచి, తలుపులు మూసి మంచం మీద వాలిపోయాను బట్టలైనా మార్చుకోకుండా.

• • • • •

బాగుంటాడు రాంబాబు.

చిరునవ్వు మొహం మీద ఎప్పుడూ వెలిగిపోతుంటుంది. ఏదో సాహిత్య సభలో అనుకుంటా అక్కయ్య అతన్ని నాకు పరిచయం చేసింది. పరిచయం చేసిన వేళావిశేష మేమిటోగాని అచిరకాలంలోనే మా ఇద్దరి మధ్యా స్నేహం చిగిర్చి పుష్పించింది.

రాంబాబు మంచి కథకుడు. డబ్బులకోసమో, లేక పత్రికల్లో తరచూ తన పేరు కనిపించాలనే తాపత్రయం తోనో అతను కథలు వ్రాయడు. అతను రాసిన కథలు సామాజిక జీవితానికి అద్దం పడతాయి. మనుష్యుల్ని బాగా స్టడీ చేసి రాస్తాడు. పాత్రల మనస్తత్వ చిత్రీకరణ అద్భుతంగా ఉంటుం దాయన కథల్లో.

అతను బొమ్మలు కూడా గీస్తాడు. పైగా చక్కటి గొంతుంది. వందూరి వారి ఎంకిపాటలు ఆహ్లాదంగా ఉంటా యతను పాడితే. సహృదయుడు, స్నేహశీలి. కాబట్టే నేను చాలా తొందరగా అతనికి చేరువయ్యాను.


• • • •

ఒక పదిహేను రోజులు పోయాక—

నన్ను రాంబాబుతో స్నేహం మానుకోమని చెప్పిన ఆవిడ మరోసారి కలిసింది. ఈ సారి కాకతాళీయంగా మాత్రం కాదు.



INNOVATION/AP/TEL/05-A




, శీనో వంతులమ్మని. ఒక ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పని చేస్తున్నాను. ఆ వేళ లంచ్ అవర్లో నా స్కూల్ కొచ్చింది. బాగోదని విష్ చేశాను.

“రండి కూర్చోండి. బాగున్నారా?” అంటూ పలకరించాను.

ఆమె బదులుగా చిన్నగా నవ్వింది. ఆ నవ్వు మునుపట్లా మామూలుగా లేదు. ఏదో తెచ్చి పెట్టుకున్నట్లుగా అనిపించింది నాకు.

“అలా బయట వరండాలోకి వెళదాం వస్తారా?” అందామె కూర్చోకుండానే.

నేను మాట్లాడకుండా లేచి ఆమె ననుసరించాను.

ఈ సారి ఆమె హిత బోధలు వినదలుచుకో లేదు. ఏదైనా పెద్దరికం వలకబోస్తే మటుకు సహించ కూడ దనుకున్నాను. లేకపోతే ఏమిటసలు? ఈవి డెవరు, నాకు నీతులు చెబుతూ జాగ్రత్తలు బోధించ డానికి? నే నేం చిన్నపిల్లను కాను.

“మీరు నా సలహా పాటించినట్లు లేరు” అందావిడ బయట కొస్తూనే సీరియస్‌గా.

“ఏమిటా సలహా?” అన్నాను నేనూ సీరియస్‌గానే

“అదే! ఆ రాంబాబుతో మీరింకా స్నేహం చేస్తూనే ఉన్నారు.”

“అవును చేస్తున్నా.”

“ఈ మధ్య బాగా ప్రోగ్రెస్ అయినట్లుందే మీ స్నేహం.” ఆమె కంఠంలో ,వ్యంగ్యం.

“అంటే?”

“సినిమాలు, షికార్లూ చేస్తున్నారుగా.”

నాకు చివ్వున ముంచు కొచ్చింది కోపం. చురుగ్గా చూశానామె కేసి. నే నేదో దొంగతనం చేసినట్లుగా, ఆవిడో పెద్ద సి ఐ డీ లాగా ప్రశ్నలు వేయటం నాకు నచ్చలేదు. “అవును తిరుగుతున్నా. రాంబాబు గొప్ప ఆర్టిస్ట్. పైగా సహృదయుడు. అతనితో స్నేహం చెయ్యటం నేరమేమీ కాదు. అసలు మీ కెందుకీ విషయంలో అంత ఇంటరెస్టు?” అన్నాను తీవ్రంగా.

“ఇంటరెస్ట్ కాదు, బాధ” కొంచెం దూరంగా గుబురుగా ఉన్న క్రోటన్ మొక్కల కేసి చూస్తూ చెప్పసాగిం దావిడ. “మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. మీ రంటే ఏదో తెలియని అభిమానం లాగుతోంది. పెళ్ళి కాబోయే యువతిని పరాయి మగాళ్ళతో—ముఖ్యంగా రాంబాబు వంటి వాళ్ళతో తిరగటం ఎవరన్నా చూశారంటే మీ కింక జీవితంలో పెళ్ళి కాదు. పైగా మీ అక్కయ్య పేరు ప్రతిష్ఠలు.”

“ఆపండి” గట్టిగా అన్నాను ఆమెకు అడ్డొస్తూ. “నా బాగోగులు నాకు తెలుసు. మీ రేం చెప్పక్కర్లేదు. నా పెళ్ళి గూర్చిన చింత మీ కెందుకూ? రాంబాబు మంచి ఫ్రెండ్. మీ రెన్ని చెప్పినా అతనితో స్నేహం మాత్రం నే నొదులు కోను.”

“ఏం? ఎందుకని వదులుకోరు? కొంప దీసి ప్రేమించారేమిటి? అలాగయితే మాత్రం ఇంక మిమ్మల్నెవరూ రక్షించ లేరు.”

ఆవిడ మాటలు అసహ్యం వేశాయి నాకు. ఇంక వినలేక వెనుదిరిగాను. టైంకూడా అయింది. స్కూల్ ప్యూన్ ఫిఫ్త్ బెల్ కొట్టడానికి వెళ తున్నాడు.

“చూడు అరుంధతీ?” పిలిచిం దామె.

నేను నిలబడ్డాను కానీ వెనుదిరగలేదు.

“రాంబాబు అందంగా ఉంటాడనీ, మంచి ఉద్యోగం చేస్తున్నాడనీ ఆశ పడ్డారేమో! జాగ్రత్త! అత నో విషనాగు. మిమ్మల్ని కాటేస్తాడు. ఆ కాటు చాలా తీవ్రమైంది. దాని వాత పడ్డాక మీ జీవితం అంధకారం కాకతప్పదు. ఆలోచించుకోండి.” చరచరా మెట్లు దిగి వెళ్ళిపోయిం దావిడ.

ఆ తరవాత రోజులు మామూలుగానే గడుస్తున్నాయి. ఆవిడ సలహాల విషయంలో చీమ కుట్టి నట్లయినా ప్రవర్తించటం లేదు నేను. రానురాను రాంబాబు అంటే ఇష్టమేర్పడింది. నా మనసు అతనికి సన్నిహితం కాసాగింది. అతని సహచర్యం వదులుకో లేకపోయాను. ఇదివరకటి కంటే ఎక్కువ చనువుగా తిరగసాగాను.

ఆవిడ నన్ను హెచ్చరించిన విషయం ఎన్నోసార్లు రాంబాబుతో చెప్పాలనుకున్నా. నోటి దాకా వచ్చిన మాటని చాలాసార్లు వెనక్కి తీసుకున్నాను కూడా. అవిన్నీ పిచ్చిదాని కింద జమ కట్టి రాంబాబుతో ఆ విషయం ప్రస్తావించనే లేదు.

ఆ తరవాత ఒకటి రెండు సార్లు రాంబాబూ, నేనూ కలిసి తిరుగుతున్నప్పుడు ఆవిడ మమ్మల్ని చూట్టం జరిగింది. ఆ సమయంలో ఆవిడ కళ్ళలో నిప్పులు కురిసేవి ఎందుచేతనో. ఆ మొహం చూసి నప్పుడల్లా నా కెందుకో ఆమె ఈర్ష్య పడుతోందనీ ఆమెని మరింతగా ఉడికించాలనీ అనిపించేది. అటు వంటప్పుడు కావాలనే రాంబాబుతో ఇంకొంచెం సన్నిహితంగా ఉండేదాన్ని.

ఒక రోజు ఉదయం నేను స్కూల్ కెళుతూ మా అక్కయ్య ఏదో కథల పోటీ కోసం రాసిన కథని పోస్టు చెయ్యమనిస్తే పోస్టాఫీసు కేసి నడిచాను. కవరు మీద స్టాంపు అతికిస్తూ ఎందుకో తలెత్తి చూస్తే ఎదురుగా రాంబాబు రావటం కనిపించింది.

అతన్ని చూడగానే కల్గిన సంతోషం వల్ల “హల్లో!” అన్నాను ఉల్లాసంగా.

“హలో! ఏమిటిట్లా వచ్చారు?” అన్నాడు అతనూ నవ్వుతూ.

“మా అక్కయ్య కథల పోటీ కోసం కథ రాసింది. దాన్ని పోస్టు చెయ్యమంటే ఇటొచ్చాను. మరి మీరో?”

“నేనూ అందుకే.”

“మీరూ పోటీలో పాల్గొంటున్నా రన్నమాట. అలాగయితే బహుమతి రావటం ఖాయం. ఏమం టారు?”

మందహాసం చేశాడు రాంబాబు. తెల్లని అతని పలువరస తళుక్కుమనటం చూశాను. అతనన్నాడు “మరి ఇప్పుడే అలా ఖాయం చేసెయ్యకండి. నేను కథ పంపితే ప్రయిజు రావాలనే రూలేం లేదు. మహా మహులు చాలా మందున్నారు కథ రాసే వాళ్ళు.”

“నా మాట నిజం కాకపోతే చూడండి. మరి ప్రయిజు వస్తే నా కేమిస్తారు?” అడిగాను అల్లరిగా అతని కళ్ళలోకి చూస్తూ.

“చెప్పండి ఏం కావాలి?”

“ఇస్తారా అడిగింది?”

అతను కొద్దిగా సంశయించాడు. తర్వాత తేలిగ్గా నవ్వేసి అన్నాడు: “సరే! నాకు చేతనైంది ఇస్తాను. గొంతెమ్మ కోర్కెలు కోరకండి.”

ఇద్దరం కవర్లు అంటించాం. నేను డబ్బాలో వేశాను. అతనూ వెయ్యబోతుంటే చటుక్కున చెయ్యి పట్టుకొని ఆపాను. ఆ ఆపటంలో కవరు పట్టుకున్న అతని చెయ్యి నా గుండెల వరకూ వచ్చింది. నాలో ఏదో విద్యుత్తు పాకింది. అది పోస్టాఫీసని మరిచి పోయి కాస్సేపు అలాగే ఉండిపోయాను.

“ఏమిటి ... ఎందు కాపారు?” అన్న మాటతో తేరుకొని సిగ్గుపడి, “ఆ కవరిట్లా ఇవ్వండి. నా చేత్తో వేస్తాను” అన్నాను.

రాంబాబు మందహాసం చేశాడు. నేను పట్టించు కోకుండా చేతిలోంచి కవరు తీసి డబ్బాలో వేశాను.

అప్పుడు చూశాను—ఎదురుగా షాపులో ఏదో కొంటూ మాకేసి తీవ్రంగా చూస్తున్న ఆవిడను.

ఎప్పట్లానే ఆవిడ కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. ఇప్పుడు మరింతగా! చటుక్కున తల తిప్పుకొని రాంబాబుతో సాయంత్రం కలుద్దామని చెప్పి వెళ్ళి పోయాను.

● ● ● ●

ఆ రోజు స్కూలు లేదు.

ఇంట్లో బోర్‌గా ఉంటే మార్నింగ్ షో 'కన్యాశుల్కం' చూదామని బయల్దేరాను.

రాంబాబు ఉదయమే వూరెళ్ళాడు. ఒంటరిగా సినిమాకి వెళ్ళక తప్పలేదు నాకు.

నేను వెళ్ళేసరికి బుకింగ్ కౌంటరు దగ్గర నిలబడి ఆవిడ మళ్ళీ కనిపించింది. నన్ను చూసి "అరుంధతీ" అని పిల్చింది.

ఆవిణ్ణి గుర్తించి తప్పుకునే ప్రయత్నంలో మరో కౌంటరు కేసి వెళ్ళబోతున్న నాకు అటు తిరక్క తప్పలేదు. దగ్గరగా వెళ్ళాను. రెండు టిక్కెట్లూ ఆమే తీసింది. నేను డబ్బు ఇవ్వబోతే తీసుకోలేదు. థియేటర్లో ప్రవేశించాం.

లోపల జనం అట్టే లేరు. వెళ్ళి ఓ మూలగా కూర్చున్నాం. పిక్చర్ ఇంకా బిగిన్ కాలేదు. ఆమె సంభాషణ ప్రారంభించింది.

"రాంబాబు వూరెళ్ళాట్టగా?" అంది ఉపోద్ఘాతంగా.

ఆవిడా టాపిక్ ఎత్తటం నా కసలు ఇష్టంలేదు. అందుకే ముక్తసరిగా— "అవును." అన్నాను.

"రాత్రి నువ్ అతి ఇంట్లో ఉన్నావుటగా?" కాస్సేపాగి మళ్ళీ అందావిడ.

నేను ఉలిక్కిపడి ఆవిడకేసి తిరిగాను. "ఎవరు చెప్పారు మీకు?" అన్నాను ఆదుర్దాగా. నా కొద్దిగా భయమేసింది ఈవిడ కెట్లా తెలిసిందాని. దీనివల్ల ఏ విపరీత పరిణామాలు జరుగుతాయోనని ఆలోచించాను. పిక్చర్ చూసే మూడ్ పూర్తిగా పాడయ్యింది.

"ఎవరు చెబితే ఏంలే ... నిజమా, కాదా ఈ సంగతి?" అందావిడ నిలదీస్తున్నట్లు.


అబద్ధం చెప్పి లాభం లేదు. మౌనం వహించటం కూడా మంచిది కాదు. నా మౌనాన్ని ఆవిడ మరోలా అర్థం చేసికోవచ్చు. అందుకుతోడు నేను చేసిన దొంగతనం కూడా ఏం లేదు. "అవును, సాయంత్రం అతనింటి కెళ్ళాను. ఏవో మాట్లాడుతూ కూర్చున్నాం. మాటల్లోనే చీకటి పడిపోయింది. ఈ లోగా బయట కుండపోతగా వర్షం. వర్షం వెలిసేసరికి చాలా రాత్రయింది. రాంబాబే నన్ను మా ఇంటిదాకా దిగబెట్టి వెళ్ళాడు."

"ఆహా ...!" ఆవిడ గొంతు విచిత్రంగా ధ్వనించింది. థియేటర్లో లైట్లారిపోయాయి. అందుచేత ఆవిడ మొహంలో భావాలు గమనించలేకపోయాను.

"ఐతే అంతా అయిపోయి ఉండాలే!"

"ఏమి టా అయిపోయేది?"

"తెలియనట్టు మాట్లాడుతావేం? ముళ్ళ కంచెలో పడ్డాక ముళ్ళు గుచ్చుకోకుండా బయట కొస్తారా? ఆ రాత్రివేళ, ఇంట్లో మీ ఇద్దరు తప్ప మరెవ్వరు లేరు. బయట జోరుగా వర్షం. ఇకనేం?




అనలైన వాతావరణం. రాత్రంతా మీ ఇద్దరూ ఆనందలోకాల్లో విహరిస్తూ ..."

"నాన్సెన్స్ ...! ఏమిటి మీరు మాట్లాడేది?" అరిచాను— అది థియేటరని మరిచిపోయి. ఆవేశంలో నా పెదాలు కంపించాయి. "నువ్వనుకున్నట్టు ఏమీ జరుగలేదు. అసలేమిటి నీ ఉద్దేశం? నే నేమను కున్నావ్? రాత్రి కొద్దిసేపు అనుకోకుండా నో స్నేహితుడింట్లో ఉండిపోగానే అంతా అయిపోయిందని అడగటమేనా పిచ్చి పిచ్చిగా మాట్లాడకండి."

"చూడు, అరుంధతీ!" నే నెంత ఆవేశంతో అన్నానో ఆవిడంత శాంతంగా అంది. "నీ బాధ నే నర్థం చేసుకో గలను. ముందే చెబితే వినిపించుకోలేదు. మాయ మాటలు చెప్పి నిన్నతను తనింట్లో ఉండిపోయేలా చేశాడు. లేకపోతే మీ ఇంటికీ, అతనింటికీ ఎన్ని మైళ్ళు దూర ముందేమిటి? వర్షమట వర్షం... కబుర్లు చెప్పకు."

"మీరు ... మీరు చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు. మే మే తప్పూ చెయ్యలేదు."

"భయపడకు, అరుంధతీ! ఈ విషయం మీ అక్కయ్యకి తెలిస్తే ప్రమాద మనుకొంటున్నావ్ కదూ? నే నంత తెలివి తక్కువదాన్ని కాదు. ఆమెతో చెప్పన్లే. కానీ ఒక్కటిమాత్రం గుర్తుంచుకో రాంబాబు నాగుబాము. ఇప్పటికైనా అతనో స్నేహం ఆపెయ్యి. ఈ సంగతి నే నింకెవ్వరితోనూ చెప్పను. లేదా ..." అంటూ ఆగిపోయిం దావిడ.

నాకు తిక్కరేగిం దావిడ బెదిరింపు చూస్తుంటే. నాకు తెలుసు ఆ రాత్రి మా మధ్య ఏమీ జరగలేదని. రాంబాబు మీద నా కా నమ్మకం ఉండబట్టే నేనట్లా ఉండిపోయాను. ఆర్టిస్ట్‌గానే కాకుండా అతను నిజ జీవితంలోనూ మంచి మనిషి. అతన్ని పట్టుకొని నాగుబాముతోనూ, ముళ్ళకంచెతోనూ పోల్చటమే కాకుండా ఈ రకం బెదిరింపులు ఆవిడ చెయ్యటం నన్ను పూర్తిగా రెచ్చిపోయేలా చేశాయి. తెగింపుగా అన్నాను: "అవును — రాంబాబుతో నా స్నేహం ఇంకా ఇలాగే కొనసాగిస్తా. మీ బెదిరింపులకు నేనేం జడవను. అత నా రాత్రి నన్నేం చెయ్యలేదంటే నమ్మలేదు మీరు. నిజమే! ఇప్పుడు చెప్తున్నా వినండి. అతను నన్ను చెరగొట్టాడు. అయినా నాకేం బాధ లేదు. ఆ అవకాశమూ, అధికారమూ అతనికి నేనే ఇచ్చుకున్నాను. ఎంచేతంటే, మేమిరువురం ప్రేమించు కున్నాం కనుక. ఇక వెళ్ళి మా అక్కయ్యతో చెప్తు కుంటారో లేక వూరంతా చాటింపు వేస్తారో మీ ఇష్టమొచ్చినట్లు చెయ్యండి. నేనేం బెదిరిపోను సరికదా ... ముందు ముందు ఇంకా అతన్ని నా కొంగుకి ముడేసుకుంటాను."

ఈ మాటలన్న తరవాత నే నింక అక్కడుండ లేదు. చీకట్లోనైనా చరచరా నడుస్తూ థియేటర్లోంచి బయట పడ్డాను.

ఇది జరిగాక నాలుగు రోజులకి ఎప్పట్లాగే సాయంత్రం రాంబాబు ఇంటికి వెళ్ళాను. గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళబోతూ టక్కున ఆగి పోయాను. ఎదురుగా గుమ్మంలో ఆవిడ నిలబడుంది. నా కాశ్చర్యంతో మతి పోయింది. కాసేపు దిష్టి బొమ్మలా నిలబడిపోయాను.

నేను తేరుకుని తలెత్తి చూసేసరికి, ఆవిడ అసహ్యంగా చూపుల్ని తిప్పుకుని విసురుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఒక నిమిషం పోయాక రాంబాబు బయట కొచ్చాడు. నన్ను చూడగానే మొదట కంగారు పడ్డాడు. మొహంలో చప్పున రంగులు మారిపోయాయ్. నేను గమనించాను.

"రండి, కూర్చోండి" అన్నాడతను కొత్తగా, నే నేదో ఇబ్బంది ఫీలయ్యాను నాకు తెలియకుండానే.

"మీ స్కూల్ ఎలా ఉంది?" అనే అర్థంలేని ప్రశ్న వేశాడు

"బాగుంది. కొత్తగా అడుగుతున్నారేం? మా స్కూల్ ఎప్పట్లానే ఉంది" అన్నాను నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆ తరవాత మా మధ్య యేదో తెర దించి

నిట్టుగా అర్థంలేని మౌనం రాజ్యం చేసింది. కాస్సేపు పోయాక నేనే అడిగాను "ఇందాక నే నింట్లో కొస్తుంటే ఒకావిడ లోపలికి వెళ్ళింది. ఎవరావిడ మీ చుట్టమా?"

ఈ ప్రశ్న రాంబాబు మీద చాలా ప్రభావం చూపింది. ఆ ప్రభావం ఎట్లాంటిదో నేనూహించలేకపోయాను. కానీ నే నతనికి బొత్తిగా ఇష్టంలేని ప్రశ్న అడిగానని మాత్రం నా కర్థమైంది.

అతను చాలాసేపు మాట్లాడలేదు. తల దించుకుని ఉండిపోయాడు. నాలో ఎన్నో ఆలోచనలు పాతిక్కాళ్ళకి మళ్ళీ అల్లుకోసాగాయి, మొన్న థియేటర్లో రాంబాబును గురించి అంత ఇదిగా మాట్లాడిన ఆవిడే స్వయంగా ముళ్ళకంచె లాంటి ఆ ఇంట్లో ఎందుకు ప్రవేశించిందో అర్థం కాలేదు నాకు.

"చెప్పరేం? ఆవిడ మీ చుట్టమా?" నేను రెట్టించి అడగటంతో రాంబాబుకి జవాబు చెప్పక తప్పలేదు.

"చుట్టం కాదు, అరుంధతీ! ఆవిడ నా భార్య" అన్నాడు బరువైన గొంతుతో.

నేను షాక్ తిన్నాను. "ఏమిటీ మీ భార్యా? మీకు పెళ్ళైందా?"

"అవును. ఆమె పేరు రజని. మా మావయ్య కూతురు. నేను చదువుకునే రోజుల్లోనే పెళ్ళయ్యింది."

నా బుర్ర గిర్రున తిరగసాగింది. నన్ను నే నెలా నిలదొక్కుకోవాలో అర్థం కాలేదు. ఆ పరిసరాల్లోంచి వెంటనే పారిపోవాలనిపించింది. వెళతానంటూ లేచాను.

రాంబాబు కూడా మౌనంగా నన్ననుసరించాడు. బస్టాప్ వరకూ ఇరువురం మాట్లాడకుండానే వచ్చాం.

"ఒక్క విషయం అడగనా?" అన్నాను నేను అక్కడి కొచ్చాక.

రాంబాబు భారంగా నిట్టూర్చాడు. "అడుగు, అరుంధతీ!"

"ఆవి డెప్పుడూ మీ ఇంట్లో కనిపించ లేదేం?"

"అదే అసలైన విషాదం", అరుంధతీ! చచ్చిపోయే ముందు మా అమ్మ మాటకు తలొగ్గి రజని మెడలో తాళి కట్టాను. కానీ మా మనస్తత్వాలు రెండూ రెండు భిన్న ధృవాలు. నాకు గుడ్‌బై చెప్పేసి రజని పుట్టింటి కెళ్ళి పోయింది. వాళ్ళ దీ వూరే. ఆమెను తీసుకు రావాలనే ప్రయత్నాలన్నీ ఆమె మూర్ఖత్వం ముందు ఎందుకూ పనికి రాకుండా పోయాయి". చెప్పి తల వంచుకున్నాడు రాంబాబు

ఎన్నేదో తెలియని నీరసం ఆవహించింది. చాలా సేపు మాట్లాడ లేకపోయాను. నా మనసులో నే నడక్కుండా నిలిచిపోయిన ఒక ప్రశ్నకి జవాబు చెబుతున్నట్లుగా చివరికి రాంబాబు అన్నాడు: "నాల్రోజుల క్రితం నే నూరెళ్ళాను. నీకు తెలుసుగా, అరుధంతీ! . తిరిగొచ్చేసరికి ఇంట్లో రజని ఉంది. ఆవిడెలా వచ్చిందో, అంత హఠాత్తుగా రావడానికి కారణమేమిటో నా కేం అర్థం కాలేదు."

"ఆమెనే అడక్క పోయారా?"

"అడిగాను. అడిగితే ఇది నా ఇల్లు, నా సంసారం, నే నెప్పుడైనా వస్తానంటూ ఏదో అంది. కానీ అసలు కారణం మాత్రం అది కాదనిపిస్తుంది."

నే నింకేం మాట్లాడలేదు. అసలు కారణం ఏదో నాకు తెలిసింది. నేనే ఆ అసలైన కారణం. మొగుడు మరొక అమ్మాయితో సినిమాలకి షికార్లకి తిరుగుతూ చివరికి రాత్రుళ్ళుకూడా ఆమెతో గడుపుతున్నాడంటే ఏ ఆడది సహిస్తుంది? అంతేకాక అతన్ని నేను కొంగున ముడేసు కుంటాననికూడా చెప్పారేమో!


నా ఆలోచనల్ని తెంపుతూ బస్సొచ్చి ఆగింది ఎక్కబోయే ముందు రాంబాబు చటుక్కున నా చేయి పట్టుకుని అన్నాడు, "నన్ను క్షమించు అరుంధతీ!"

పేలవంగా నవ్వుతూ—"ఇందులో క్షమించ డాని కేముంది?" అన్నా న్నేను. అలా అని వెళ్ళి బస్సెక్కి కూర్చున్నాను.

"ఇక ముందు మనం కలుసుకోవడానికి వీల్లేక పోవచ్చును, అరుంధతీ! అందుకే క్షమించ మంటు న్నాను. నీకు తెలీదు మా ఆవిడ సంగతి. మన మధ్య ఏవో నీచమైనవి సృష్టించ డానికూడా వెను దీయదు. నువ్ పెళ్ళి కావాల్సిన అమ్మాయివి. నీ జీవితం పాడైతే నేను సహించ లేను. వస్తాను" పెంపు బస్ దగ్గిరనుంచి కదిలి వేగంగా వెళ్ళి పోయాడు రాంబాబు.

"గుడ్ బై" అన్నట్టుంగా నా పెదాలు గొణిగాయి కాని బస్ రొదలో నా మాటలు నాకే వినిపించ లేదు ✱

యద్దనపూడి సులోచనారాణి
సెప్టెంబర్ '83 విడుదల
ఋతువులు నవ్వాయి....వెల: రూ.20
చదివారా?
ఇటీవలి పునర్ముద్రణలు:
శ్వేతగులాబి రూ. 18
జాహ్నవి రూ. 18
బందీ రూ. 13
ప్రేమదీపిక రూ. 15
ఈ పుస్తకాల కోసం మీ దగ్గరలో వున్న పుస్తకవిక్రేత నడగండి. లేవంటే తెప్పించి పెట్టమనండి. వీలు కాదంటే-మీకు కావలసిన పుస్తకాల ఖరీదులో ఒక రూపాయి తగ్గించి M.O.చేయండి. ఆ 1 రూపాయికి వి.పి.పెట్టి పుస్తకాలు పంపుతాము. ప్రతులకు—
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
హెడ్ ఆఫీస్: విద్యాభవన్, మచిలీపట్నం-521001 కోడ్
బ్రాంచి: 3237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500003



తలలు రెండూ కలిసినప్పుడు పేలకు లభిస్తుంది కొత్త నివాసం

స్కూలు గాని, ఇల్లు గాని, థియేటరు గాని కావచ్చు పేలు వ్యాప్తిచెందటానికి ఇదే అవకాశం.
లైసిల్‌లో అల్కహాల్ లేదు.
ఇతర పేల మందులవలే లైసిల్ ఇగిరిపోదు. ఇది మీ తల, జుట్టులో ఉండే తేమను, పోషణనిచ్చే ముఖ్యమైన నూనెలను లాగేసి జుట్టు పొడిగా, బిరుసుగా తయారయేలా చేయదు. చుండ్రు పట్టనివ్వదు.
లైసిల్ ఆయుర్వేద పద్ధతిలో రూపొందించిన నూనెలు గలది
సువాసనచిందే లైసిల్ పేలనూ, ఈళ్ళనూ చంపివేసే పనేగాక తలకు, జుట్టుకూ పోషణను సమకూర్చి చుండ్రు పెరగకుండా చేస్తుంది.
ఎందరెందరో డాక్టర్లు లైసిల్ వాడమని సలహా ఇస్తారు.
సత్వరం సురక్షితం ఫలప్రదం




సుడొకెమికల్స్
లైసిల్
సుగంధిత పేల సంహారిణి
గణేశ్ నగర్, చించ్‌వాడ్, పూనా-411 033
Expresso/SCI/80/TL